క్లుప్తంగా

వర్షం.. హర్షం



కుందనగుర్తి సమీపంలో పారుతున్న వంక

చిప్పగిరి: అత్యధిక వేడి ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న మండల ప్రజలకు రెండు రోజులుగా మండలంలో అక్కడక్కడా కురుస్తున్న వర్షాలు ఊరటనిస్తున్నాయి. వాతావరణం చల్ల బడటంతో పాటు పొలాల్లో వేసవి దుక్కులకు వర్షం ఉపయోగపడిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీబీ డ్యాంలో 3.4 టీఎంసీల నీరు నిల్వ

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరప్రదాయిని తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. డ్యాంలో నీరు లేక కళ తప్పగా ఎల్లెల్సీ బోసిపోతోంది. ఆంధ్రకు సంబంధించి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాం గడిచిన నాలుగేళ్లుగా ముందస్తు వర్షాలతో జూలై ముందుగానే పూర్తి స్థాయిలో నిండి పలు సార్లు డ్యాం గేట్లు ఎత్తి నదికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో డ్యాంలో నీటి నిల్వ అడుగంటింది. ఈ ఏడాదైనా ముందస్తు వర్షాలు కురువాలని రైతులు ఎదురు చూస్తున్నారు. టీబీ డ్యాంలో మంగళవారం నాటికి 1,633 అడుగులకు గానూ 1,577.60 అడుగులతో 105,788 టీఎంసీలకు గాను 3.415 టిఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో కాగా, అవుట్ ఫ్లో 13 క్యూసెక్కులుంది.

నేడు కరివేములలో గ్రామ దేవర

దేవనకొండ: మండల పరిధిలోని కరివేముల గ్రామంలో బుధవారం గ్రామ దేవర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అన్నివర్గాల వారు దేవరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాగా దేవర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడ వద్దని, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాన్ని నిర్వహించుకోవాలని సీఐ శ్రీనివాసులు గ్రామస్తులకు సూచించారు.

ఓటు వేయడానికి వచ్చి మృత్యుఒడికి!

- ఎం.కొట్టాల గ్రామంలో విషాదం



చిట్టిబాబు (ఫైల్)

ఆలూరు: ఓటు వేసేందుకు వస్తూ దారి మధ్యలోనే మృత్యుఒడికి చేరుకోవడంతో మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఎం.కొట్టాల గ్రామానికి చెందిన దుగ్గనూరు చిట్టిబాబు(35) ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడ్డాడు. ఓటు వేసేందుకని ఈనెల 12న హైదరాబాద్ నుంచి సొంతూరికి ప్రైవేట్ బస్సులో బయలు దేరాడు. ఆదోని సమీపంలోకి రాగానే సీట్లో కదలిక లేకుండా ఉన్న చిట్టిబాబును కండక్టర్ లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే విగతజీవిగా మారాడు. జేబులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా సమీప బంధువులకు సమాచారాన్ని చేరవేశారు. మృతుడికి భార్య పద్మావతమ్మ ఏడాది క్రితమే మృతి చెందగా కుమారుడు సుశాంత్, కుమార్తె శిరీష్ ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి రూ.10 వేలను దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు. అలాగే గ్రామంలోని ఎలైట్ సంస్థ నిర్వాహకులు రూ.5 వేలు అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను చూసి గ్రామంలో పలువురు కంట తడిపెట్టారు.

విధులు బహిష్కరించిన సెక్యూరిటీ గార్డులు



క్యాజువాలిటీ ఎదుట నిలిపిన వాహనాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం పలువురు సెక్యూరిటీ గార్డులు విధులు బహిష్కరించారు. ఈ మేరకు వారు అధికారుల వద్దకు వెళ్లి తమకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, యాజమాన్యంతో ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు నెలలుగా జీతాలు రాకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి జీతాలు వచ్చేలా చూస్తానని అధికారులు వారికి హామీ ఇచ్చి పంపించారు. అనంతరం ఆస్పత్రి సెక్యూరిటీ అధికారులను సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి పిలిచి మాట్లాడారు. ఏజెన్సీ నిర్వాహకునితో మాట్లాడి జీతాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. మూడు, నాలుగు రోజుల్లో జీతాలు వేస్తామని ఏజెన్సీ నిర్వాహకుడు చెప్పారని సెక్యూరిటీ అధికారులు సమాధానమిచ్చారు.



సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రెండు నెలలుగా బిజీగా గడిపిన వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి మంగళవారం కుటుంబ సభ్యులతో సేదతీరుతూ కనిపించారు. సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారంతో తీరిక లేకుండా గడిపిన శ్రీదేవి.. ఈనెల 13న ఎన్నికలు పూర్తి కావడంతో రిలాక్స్ అయ్యారు.

● ధన్యవాదాలు!

ఆలూరు: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసిన నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినె విరూపాక్షి అన్నారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యర్తలతో సమావేశమయ్యారు. ఓటింగ్ సరళిపై చర్చించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి తన వెంట ఉండి ప్రోత్సహించిన నాయకులకు, ప్రచారానికి సహకరించిన కార్యకర్తలకు, స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.



నాయకులతో సమావేశమైన విరూపాక్షి

హాలహర్వి మండలంలో 78.26 శాతం

హాలహర్వి: మండల వ్యాప్తంగా 78.26 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 36,307 మంది ఓటర్లు ఉండగా, 29,002 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. ఇందులో పురుషులు 14,396 మంది, మహిళలు 14,396 మంది, ఇతరులు ఐదుగురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



నెట్రవట్టిలో బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

హొళగుంద మండలంలో 79.11 శాతం

హొళగుంద: మండలంలో 79.11 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో 78 శాతం నమోదు కాగా ఈసారి ఒక శాతం పెరిగింది. మొత్తం 42,947 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 21,342, పురుషులు 21,589, ఇతరులు 16 మంది ఉన్నారు. దాదాపు 31 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



హొళగుందలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళా ఓటర్లు (ఫైల్)

ఓటెత్తిన చైతన్యం

- నియోజకవర్గంలో 84.98 శాతం పోలింగ్



కృష్ణగి మండలం చిట్యాలలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

పత్తికొండ రూరల్/కృష్ణగిరి/మద్దికెర: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాచైతన్యం వెల్లువిరిసింది. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో 84.98 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,23,603 మంది ఓటర్లు ఉండగా 1,90,003 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 96,300 మంది పురుషులు, 93,662 మంది మహిళలు, 22 మంది ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్నిరోజుల నుంచి ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఒక రోజు ముందుగా వర్షం పడటంతో ఉపశమనం కలిగింది. గంటల తరబడి వరుసలలో నిలబడి మరీ ఓటు వేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ రాత్రి 7గంటల వరకు కొనసాగింది.

కృష్ణగిరిలో 88.18 శాతం ఓటింగ్ నమోదు

కృష్ణగిరి మండలంలో ఎప్పుడూ లేనంతగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో 33,874 మంది ఓటర్లు ఉండగా 28,792 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో అప్పట్లో 84.99 శాతం నమోదైంది. ఈ సారి 4 శాతం ఓటరు నమోదు పెరిగింది. మండల వ్యాప్తంగా 36,775 మంది ఓటర్లు ఉండగా 32,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 16,617 మంది పురుషులు, 15,813 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 88.18 శాతంగా నమోదైంది.

మద్దికెరలో 83.5

మద్దికెర మండలంలో 29,592 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 14,559 మంది, మహిళలు 15,030 మంది ఉన్నారు. ఓటింగ్‌లో మొత్తం 24,744 మంది పాల్గొనగా పురుషులు 12,584 మంది, మహిళలు 12,158 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో మండలంలో 83.5 శాతం ఓటింగ్ నమోదైంది.

ఆస్పరి మండలంలో 81.60 శాతం పోలింగ్

ఆస్పరి: మండలంలో 81.60 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. మండలంలో మొత్తం 52,821 మంది ఓటర్లు ఉండగా 43,094 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 22,186 మంది, పురుషులు 20,906 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఆస్పరి మండలం జొహరాపురంలో ఓటేసేందుకు బారులుతీరిన మహిళలు(ఫైల్)

నియోజకవర్గంలోని మండలాల వారీగా పోలింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన పురుషుల ఓట్లు	పోలైన స్త్రీల ఓట్లు	మొత్తం	ఇతరులు	శాతం
పత్తికొండ	56,964	23,699	23,463	47,165	3	82.80
తుగ్గలి	49,316	21,666	21,007	42,676	3	86.54
మద్దికెర	29,592	12,599	12,299	24,900	2	84.14
వెల్దుర్తి	50,956	21,720	21,138	42,861	3	84.11
కృష్ణగిరి	36,775	16,646	15,761	32,407	0	88.12
మొత్తం	2,23,603	96,330	93,668	1,90,009	11	84.98

చిప్పగిరిలో 80 శాతం

చిప్పగిరి: మండలంలో 80 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 24,772 మంది ఓటర్లు ఉండగా 20,109 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దేవనకొండ 80.93 శాతం

దేవనకొండ: మండల పరిధిలో 80.93 శాతం ఓటింగ్ నమోదైంది. మండల వ్యాప్తంగా మొత్తం 58,351 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 29717, మహిళలు 28,634 మంది ఉన్నారు. 47,222 మంది ఓటరుల తమ ఓటు హక్కును వినియోగించుకోగా అందులో పురుషులు 22,742, మహిళల 24,480 మంది ఉన్నారు.



రామదుర్గం పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)



పత్తికొండ మండలం దూదేకొండలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

పరామర్శ



పులికొండనాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: బ్రెయిన్ స్ట్రోక్‌తో కర్నూలు మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తుగ్గలి మండల జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్‌ను మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్‌నాయక్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు.

ఓటు వేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు



సురేందర్‌రెడ్డి

దేవనకొండ: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అబ్జర్వర్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నేకల్లు సురేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషకరమన్నారు. పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించిన అధికారులు, ఇతర సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

పోలింగ్ ప్రశాంతం

ఆస్పరి: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని సీఐ హనుమంతప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామాల్లో ఎలాంటి చిన్న సంఘటనలు జరగకుండా సిబ్బంది విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం

ఆదోని టౌన్: మలేరియా వ్యాధిని, ప్యారాసైట్‌ను గుర్తించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా మలేరియాధికారి నూకరాజు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో హ్యాట్స్ ఆన్ ట్రెనింగ్‌లో ఆయన పాల్గొని ల్యాబ్ టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రేపటి నుంచి వీహెచ్‌పీ శిక్షణా శిబిరం

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మూడు ప్రాంతాల శిక్షణా శిబిరం ఈనెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ తెలిపారు. నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో జరిగే శిక్షణలో ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర, తెలంగాణ ప్రాంతాల కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. 10 రోజుల పాటు జరిగే శిక్షణలో యోగా, ఆటలు, దేశ భక్తి గీతాలు, సంస్థల విధి విధానాలు నేర్పిస్తారని వెల్లడించారు.

రోడ్డుకు అడ్డంగా బండరాళ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామం నుంచి బొమ్మనపల్లి గ్రామం వెళ్లే రోడ్డుపై కొందరు అడ్డంగా బండరాళ్లు వేయడంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడినప్పుడు రోడ్డు దిగితే వాహనాలు, ఎద్దుల బండ్లు చిక్కుకుంటున్నాయని, ఎప్పుడు ఎక్కడ ప్రమాదానికి గురవుతామోనని భయంభయంగా వెళ్లాల్సి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదారి గుండా పొలాలు సాగు చేసుకోడానికి రైతాంగం ఎక్కువగా వెళ్తుంటారు. రోడ్డుకు అడ్డంగా పెద్ద పెద్ద రాళ్లు వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని రాళ్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా వేసిన రాళ్లు



నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తున్న రామ్మోహన్ రెడ్డి

పోలింగ్ సరళిపై సమీక్ష

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో జరిగిన పోలింగ్ సరళిపై వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలంలో జరిగిన పోలింగ్ సరళిపై ఆరా తీశారు. ఓటు హక్కు వినియోగించకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకుల, కార్యకర్తల, ఏజెంట్ల కృషికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాషా, పార్టీ మండల కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ కోటిరెడ్డి, నాయకులు రమణారెడ్డి, శ్రీరాంరెడ్డి, అశోక్ రెడ్డి, కృష్ణారెడ్డి, జయరాముడు, వెంకటేశ్వరరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

22 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ఈ నెల 22వ తేదీ నుంచి జరుగుతాయని ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న మంగళవారం తెలిపారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థినులకు బుధవారం నుంచి అప్లికేషన్ ఫారంలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఒక్కో గ్రూపులో ఇంగ్లిషు, తెలుగు మీడియం కలిపి 88 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కళాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు మే 22వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు జూన్ 10వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

మద్దికెర: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం షష్టి పురస్కరించుకొని విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించి నైవైద్యం సమర్పించారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడైన స్వామి వారికి అర్చకులు హోమాలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు, ప్రసాదం, అన్నదానం పంపిణీ చేశారు.



కంకర తేలిన మద్దికెర- బొజ్జనాయునిపేట రోడ్డు



రూ.2.50 కోట్లతో వేయించిన రోడ్డు



మద్దికెర- మొలగవెల్లి రహదారి దుస్థితి

తొలగిన 'దారి'ద్ర్యం

- టీడీపీ హయాంలో అధ్వానంగా రహదారులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో మంచి రోజులు

మద్దికెర: మండలంలోని వివిధ గ్రామాల రహదారుల సమస్యను జగనన్న ప్రభుత్వం పరిష్కరించింది. టీడీపీ హయాంలో రాళ్లు తేలి, రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉన్న రహదారుల సమస్యలను ఎమ్మెల్యే కంగాటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.11.25 కోట్ల నిధులు మంజూరు చేయించింది. ప్రస్తుతం రోడ్లు వేయడంతో ప్రజలు సంతోషంగా రాకపోకలు సాగిస్తున్నారు.



రూ.8.50 కోట్లతో పూర్తి చేసిన తారురోడ్డు



రైల్వే బ్రిడ్జి వద్ద బురదమయంగా ఉన్న రోడ్డు



రూ. 15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా రూ.15 లక్షలతో వేసిన సీసీ రోడ్డు